

సైబర్ మోసాలపై అప్రమత్తం

● అత్యవసర సమయాల్లో 1930కు ఫిర్యాదు చేయండి

● ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. ప్రజలు అవగాహన లోపం కారణంగానే మోసపోతున్నారని, దుండగుల మాయమాటలు వినకూడదన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను హేకర్లు లేదా సైబర్ మోసగాళ్ల దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని, ఎప్పుడూ ఈ వివరాలు ఇతరులతో పంచుకోవద్దన్నారు. కొంత మంది వ్యక్తులు ఆరోగ్య బీమా సొమ్మును కాజేసేందుకు కొత్త పంథా అనుసరిస్తున్నారని, ఎటువంటి క్లెయిమ్ చేయని పాలసీదారులను లక్ష్యంగా చేసుకుని మోసపూరితంగా క్లెయిమ్ చేయించి బీమా డబ్బులు తీసుకుంటున్నారన్నారు. పాలసీదారుని వివరాలతో ఇతర వ్యక్తులను ఆసుపత్రిలో చేర్పించి, వారికి చికిత్స అందిస్తున్నట్టుగా ఇతర ఆధారాలు సృష్టించి బీమా సంస్థ నుంచి డబ్బులు రాబెట్టి పరారీ అవుతున్నారన్నారు. గుర్తు తెలియని లింక్‌లు, అప్లికేషన్‌లను టచ్ చేయవద్దని, ఏ సమాచారం అడిగినా ఇవ్వవద్దని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నెంబరు1930కు ఫోన్ చేయాలని సూచించారు.



ఖరీఫ్‌నకు సర్వసన్నద్ధం

● అందుబాటులో వంద క్వింటాళ్ల పచ్చిరొట్ట, 1100 క్వింటాళ్ల వరి విత్తనాలు

7లో

జగన్ పాలనా విముక్తి దినం: ఎంపీ కలిశెట్టి

7లో

పోలీసులకు తలనొప్పిగా చోరీ కేసు


7లో

మోటార్ సైకిళ్లకు నిప్పు

● మూడు వాహనాలు దగ్ధం

● అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఘటన

7లో



లబ్ధిదారునికి రేషన్ సరుకులు అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రేషన్ పంపిణీకి పటిష్ఠ చర్యలు

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ సరఫరా వ్యవస్థను పటిష్ఠ పరిచేందుకే రేషన్ డిపోలను మళ్లీ ప్రారంభిస్తున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం మండలంలో గిట్టుపల్లి, కనిమెరక, కిండాం అగ్రహారం గ్రామాల్లో నిత్యావసర సరుకుల పంపిణీని ఆయన ప్రారంభించారు. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు ప్రతీ డిపోలో ఉదయం 8గంటల నుంచి 12, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు పంపిణీ చేస్తారన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే రేషన్ సరుకులు అందిస్తారని, ఎటువంటి అక్రమాలకు తావుండదని, మొబైల్ పోర్టబులిటీ ద్వారా ఎక్కడైనా సరుకులు పొందవచ్చునని తెలిపారు. ప్రతీ దుకాణం వద్ద ధరలపట్టిక, సరుకుల నిల్వ సమాచారం విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలపై మంత్రి శ్రీనివాస్ స్పందిస్తూ అనుభవిజ్ఞులై ఉండి విద్యావ్యవస్థపై బురదజల్లేలా మాట్లాడడం విచారకరమన్నారు. గత ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిందని, యువ నాయకుడు నారా లోకేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి ఉన్నతంగా తీర్చిదిద్దే చర్యలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ వీవీవీ.గోపాలరాజు, డీఎస్‌వో పి.మధుసూదనరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో తులసీరావు తదితరులు పాల్గొన్నారు.



కిల్తంపాలెం గ్రామ పరిధిలో సేకరించిన భూమిలో జిందాల్ ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక కార్యాలయం

ఏదో ఒకటి తేల్చాల్సిందే!

నిర్వాసితులతో కలిసి పోరాడుతాం..



పరిశ్రమ స్థాపిస్తామని రైతుల నుంచి జిందాల్ యాజమానులు భూములు తీసుకున్నారు. భూములిచ్చినవారిలో ఎకరా, రెండు ఎకరాల పొలం ఉన్న గిరిజన రైతులే ఎక్కువ. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారంతా భూములు ఇచ్చేందుకు తొలుత నిరాకరించారు. పరిశ్రమ నిర్మాణంతో ఈ ప్రాంతం జీవన స్థితిగతులు మారుతాయని, ఉపాధి దొరుకుతుందని నమ్మబలికి భూములు ఇచ్చేలా ఒప్పించారు. ఇది జరిగి పదిహేను సంవత్సరాలు గడుస్తోంది. కనీసం పునాది రాయి పడలేదు. అడిగినప్పుడల్లా పరిశ్రమ పెడతామంటున్నారు. గిరిజన రైతులకు ఇటు వ్యవసాయం చేసుకొనేందుకు భూమి లేక, ఉపాధికి నోచుకోక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తిరిగి తమ భూములు తమకు ఇప్పించాలని అడుగుతున్నారు. కుదరకపోతే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. లేకుంటే భూ నిర్వాసిత రైతులతో కలిసి పోరాడుతాం.

-ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్సీ

రైతులతో చర్చించాలి..



జిందాల్ పరిశ్రమ ఏర్పాటుకు మూడు ఎకరాల భూమిని అప్పగించాను. 2008లో ఈ ప్రాంతంలో భూములు తీసుకున్న యాజమాన్యం పరిశ్రమను స్థాపించలేదు. దీంతో గత కొంత కాలంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని జిందాల్ యాజమాన్యాన్ని కోరుతున్నాం. దీనికి ముందుకు రాకుండా మూడు సంవత్సరాలుగా ఏటా ఎంఎస్‌ఎంఈ పార్కులను స్థాపిస్తామని చెబుతూ వస్తోంది. ఆచరణలో కనిపించడం లేదు. తీసుకున్న భూముల్లో పరిశ్రమ నిర్మాణం జరగక ఇటు ఉద్యోగాలు లేక ఆటు వ్యవసాయం చేసుకొనే వీలులేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. రైతులతో సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు అన్ని విషయాలపై చర్చ జరపాలి.

-కర్రి సత్యనారాయణ, అధ్యక్షుడు, శ్రీరామ జిందాల్ భూ నిర్వాసితుల సేవా సమితి

శృంగవరపుకోట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి)

శృంగవరపుకోట మండలం కిల్తంపాలెం, మూలబొడ్డవర, చినఖండేపల్లి, చీడిపాలెం, ముషిడిపల్లి గ్రామ పరిధిలో దాదాపు 600 కటుంబాల నుంచి 1127.76 ఎకరాలను పదిహేనేళ్ల క్రితం జిందాల్ సౌత్ వెస్ట్ అల్యూమినా పరిశ్రమ (జిందాల్) స్థాపన కోసం తీసుకున్నారు. ఇంతవరకు ఈ భూముల్లో ఎటువంటి పరిశ్రమ నిర్మాణం జరగలేదు. కనీసం పునాదిరాయి పడలేదు. ఈ పరిశ్రమను ఇక్కడ నిర్మించే అవకాశమే లేదని తెలుస్తోంది. 15 ఏళ్లుగా నిరీక్షించిన నిర్వాసిత రైతులు భూములను తిరిగిచ్చేయాలని లేదంటే ప్రభుత్వ భూములుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం అరకులో బాక్సైట్ తవ్వకాలను నిషేధించింది. జిందాల్ పరిశ్రమకు ఇదే ముడిసరుకు. దీంతో పరిశ్రమ (మిగతా 8వ పేజీలో..)

- భూములు తిరిగిచ్చేయండి
- ప్రభుత్వమైనా స్వాధీనం చేసుకోవాలి
- జిందాల్ నిర్వాసితుల డిమాండ్
- రాజుకుంటున్న వివాదం
- పరిశ్రమ స్థాపించకపోవడంపై ఆగ్రహం
- పెద్దల సహకారంతో ఉద్యమ బాట
- ఎంఎస్‌ఎంఈ పార్కు పేరుతో నమ్మబలుకుతున్న యాజమాన్యం

వెలుగు అధికారుల బదిలీల్లో

గందరగోళం

● కొందరికే స్థానచలనం



విజయనగరం కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) పేదరిక నిర్మూలన సంస్థ(వెలుగు)లో పని చేసే ఉద్యోగుల బదిలీల తంతు గందరగోళంగా మారింది. మార్గదర్శకాలను తుంగలో తొక్కినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సెర్ప్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం జీవో ఇచ్చింది. అత్యధిక సిబ్బంది ఉన్న జిల్లాల నుంచి కొందరిని వేరు చేసి తక్కువ సిబ్బంది ఉన్న జిల్లాలకు పంపించాలన్న ఉద్దేశంతో జీవో ఇచ్చారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లా నుంచి 22 మంది ఏపిఎంలు, ఆరుగురు డిపిఎంలను ఇతర జిల్లాలకు పంపించాలన్న ఉద్దేశంతో వారిని ఆదివారం రాష్ట్ర సెర్ప్ కార్యాలయానికి కౌన్సెలింగ్ కోసం పంపించారు. విజయవాడ వెళ్లిన 22 మంది ఏపిఎంలలో 17 మందిని మాత్రమే వేరే జిల్లాలకు పంపించారు. మిగిలిన ఐదుగురు ఏపిఎంలను తిరిగి సొంత జిల్లాలో ఉంచడంపై కొంతమంది సిబ్బంది పెదవి విరుస్తున్నారు.

వరదల్లో చిక్కుకున్న తహసీల్దార్

● గత నెల 27న సిక్కింలోని గ్యాంగ్‌టక్ పర్యాటక ప్రాంతానికి కుటుంబ సభ్యులతో చేరిక

● మూడు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలు

● ఉధృతంగా ప్రవహిస్తున్న తీస్తా నది

● తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విజయనగరం కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సిక్కిం వరదల్లో విజయనగరం తహసీల్దార్ కూర్మనాథరావు, కుటుంబ సభ్యులు చిక్కుకున్నారు. అక్కడ మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తీస్తా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. రాకపోకలు నిలిచిపోవడంతో లాంచ్ గ్రామం వద్ద ఓ ప్రైవేటు హోటల్‌లో ఉండిపోయారు. తహసీల్దార్ కూర్మనాథరావు, భార్య ఉమా (డిప్యూటీ తహసీల్దార్), కుమార్తె దీక్షత, కుమారుడు జయష్ నారాయణ కలిసి గత నెల 27న సిక్కిం రాష్ట్రం గ్యాంగ్‌టక్ సందర్శనకు వెళ్లారు. ఆ ప్రాంతం చూశాక నార్త్ సిక్కిం నుంచి వచ్చేద్దామనుకున్న సమయంలో వర్షాలు మొదలయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురవడంతో తీస్తానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రధాన రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ పరిస్థితిలో లాంచ్ గ్రామం వద్ద ఒక ప్రైవేటు హోటల్‌లో కుటుంబ సభ్యులతో సురక్షితంగా ఉన్నారు. విషయం



హోటల్ బయట తహసీల్దార్ కుటుంబ సభ్యులు

తెలుసుకున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. దీనిపై కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడా తహసీల్దార్‌తో మాట్లాడి అక్కడి స్థితిగతులను తెలుసుకున్నారు. వరద ఉధృతంగా ఉందని, ఎటువెళ్లాలన్నా రోడ్డు మార్గం లేదని, లోకల్ కానిస్టేబుల్ కూడా వచ్చారని తహశీల్దార్ కూర్మనాథరావు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు. తమతోపాటు శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు, కర్నూల్‌కు చెందిన ఒకరు ఉన్నారని తెలిపారు.

హడలెత్తిస్తున్నాయ్!

● రెండు గ్రామాల మధ్య గజరాజుల సంచారం

● గ్రామస్థులు, రైతుల బెంబేలు

గరుగుబిల్లి, జూన్1(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం దళాయివలస, ఉల్లిభద్ర గ్రామాల నడుమ గజరాజులు సంచరిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతవాసులు హడలెత్తిపోతున్నారు. రెండు రోజులుగా గొట్టివలస సమీపంలో హల్‌చల్ చేసిన ఏనుగులు ఆదివారం ఆ రెండు గ్రామాల మధ్య ప్రత్యక్షమయ్యాయి. దీంతో రైతులు ఖరీఫ్ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లలేక పోతున్నారు. మరోవైపు గజరాజులు ఎక్కడ గ్రామాల్లోకి వస్తాయోనని ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా గజరాజులను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్లు చర్యలు చేపడుతున్నారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడరాదని గ్రామస్థులను హెచ్చరిస్తున్నారు.





ఫ్లోరైడ్ రక్కసిపై యుద్ధం

● నాలుగు మండలాల్లోని 25 గ్రామాల్లో ఫ్లోరైడ్

● 88 మంది బాధితుల గుర్తింపు

● సర్వే చేసిన జిల్లా వైద్యశాఖ

● అదుపునకు తక్షణం చర్యలు

రాజాం రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరైడ్ నియంత్రణపై వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లావ్యాప్తంగా ఫ్లోరైడ్ మూలాలపై సర్వే నిర్వహించింది. అత్యధికంగా బాధితులు రాజాం నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న 25 గ్రామాల్లో ఉన్నట్లు నిర్ధారించింది. ఆయా గ్రామాల్లో 88 మంది ఫ్లోరైడ్ బారిన పడినట్లు, వీరిలో 30 మంది వరకూ చిన్నారులున్నట్లు గుర్తించింది. ఇప్పటికే వారికి వైద్యసేవలతో పాటు అవసరమైన పరికరాలు అందజేసింది. జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులక్కూడా స్ర్కీనింగ్ టెస్టులు నిర్వహించి భవిష్యత్తులో ఫ్లోరైడ్ మహమ్మారి బారిన పడకుండా కార్యాచరణ రూపొందించింది.

ఫ్లోరోసిస్ లక్షణాలివీ..

ఫ్లోరోసిస్ బారినపడితే కాళ్లు, చేతులు వంకరపోవడం, వెన్నుముక కట్టేలా బిగుసుకు పోవడం, ఎముకలు పెళుసుబారడం వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. వెన్నెముక లిగ్‌మెంట్స్ ఉబ్బిపోయి, నరాలు ఒత్తుకుపోయి, కాళ్లు, చేతులకు తిమ్మిర్లు వచ్చి అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఎదురవుతుందని వైద్యులు చెబుతున్నారు. జీర్ణవ్యవస్థతో పాటు ఎర్ర రక్తకణాలు, వీర్య కణాలపైనా ఫ్లోరైడ్ దుష్ప్రభావం





చూపుతుందని వైద్యులంటున్నారు. దంతాలు పసుపు లేదా గోధుమవర్ణం నుంచి నల్లగా మారి దెబ్బతింటాయని, కొంత మందికి కాళ్లు వంకర్లు పోతాయని స్పష్టం చేస్తున్నారు. ఫ్లోరైడ్ మూలాలున్నట్లు నిర్ధారించిన గ్రామాల్లో గర్భిణులుంటే ముందస్తు పరీక్షలు (మిగతా 8వ పేజీలో..)



ఉయ్యాల..కంబాల ఉత్సవం జరుగుతున్న దృశ్యం

ఉత్సవ సందడి

● పార్వతీపురంలో పండుగలు ప్రారంభం ● అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

● ఆలయాల వద్ద భక్తుల బారులు ● తొలిరోజు ఘనంగా ఉయ్యాల కంబాల

● నేడు తొలేళ్లు.. రేపు సిరిమానోత్సవాలు

పార్వతీపురం టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం పార్వతీపురంలో సంబరాలు మొదలయ్యాయి. అమ్మవార్ల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పార్వతీపురం, జగన్నాథపురం, బెలగాం ప్రజల ఇలవేల్పులు ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ, బంగారమ్మ పండుగల నేపథ్యంలో అంతటా సందడి వాతావరణం నెలకొంది. ప్రతి వీధి స్థానికులతో పాటు బంధువులు, స్నేహితులతో కళకళలాడుతోంది. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి ఆయా ఆలయాల్లో భక్తులు తాకిడి ఒక్కసారిగా పెరిగింది. ముగ్గురు అమ్మవార్ల పెద్దమ్మ బెలగాం కోటదుర్గా ఆలయంలోనూ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకొనేందుకు మహిళలు బారులుదీరారు. పసుపు, కుంకుమలు చెల్లించన అనంతరం బంగారమ్మకు ప్రత్యేకంగా ప్రసాదాలు సమర్పించారు. పట్టణానికి చెందిన (మిగతా 8వ పేజీలో..)

ఖరీఫ్‌నకు సర్వసన్నద్ధం

●100 క్వింటాళ్ల పచ్చిరొట్ట, 1100 క్వింటాళ్ల వరి విత్తనాలు రెడీ

● 7 వేల ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో మొక్కజొన్న సాగుకు ఏర్పాట్లు


దుక్కు పనుల్లో రైతు

విజయనగరం రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో విజయనగరం మండలంలోని రైతాంగం ఖరీఫ్‌నకు సిద్ధమవుతున్నారు. విజయనగరం మండల పరిధిలో 14 పంచాయతీల పరిధిలో 23 గ్రామాలున్నాయి. గత ఏడాది 6 వేల ఎకరాల్లో వరి పంట, 63 ఎకరాల్లో జొన్నపంట గత ఖరీఫ్‌లో వేయగా, ఈ ఏడాది ఖరీఫ్‌నకు సంబంధించి 7 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా 100 ఎకరాల్లో మొక్కజొన్న వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు కూడా కార్యచరణకు సిద్ధమయ్యారు. విజయనగరం మండలానికి సంబంధించి 100 క్వింటాళ్ల పచ్చిరొట్ట, 1100 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేస్తున్నారు. ఇంకా విత్తనాలు అవసరమైతే, తెప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఇందుకు అవసరమైన ఎరువుల విషయంలో కూడా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

విజయనగరం మండలంలో 13,112 మంది రైతులు వుండగా, అన్నదాత సుఖీభవ కింద 10,112 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది, అదే విధంగా 580 మందికి కౌలుదారుల కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం వీరి కోసం మండల వ్యవసాయాధికారి హర్షలత ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇతర రైతుల మాదిరిగా కౌలు రైతులు ప్రయోజనం పొందాలంటే పంట సాగుదారు హక్కు పత్రాలు (సీఆర్‌సీసీ) కలిగి వుండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ పత్రాలు ఉంటే పంట నమోదు, పంటల బీమా, పంట రుణాలు కౌలు రైతులు అందు అవకాశం ఉంది.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

సీతానగరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరఖండి గ్రామానికి చెందిన మార్కొండ పట్నాయకుని పోలారావు (60) కొద్ది రోజుల కిందట అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ ఎం.రాజేశ్ కథనం మేరకు.. పోలారావు దీర్ఘకాలంగా పెరాలసిస్ వ్యాధితో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు సమీపంలోని బంధువుల్లో వెతికారు. పోలారావు కుమారుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సరుకుల నాణ్యతపై విచారణ చేయండి

చీపురుపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో నిత్యావసర సరకులు సరఫరా చేయడానికి చీపురుపల్లికి చెందిన వ్యక్తులు రూ.52 కోట్లకు టెండర్లు దక్కించుకున్నారని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సరుకుల నాణ్యతపై విజిలెన్స్ దర్యాప్తు చేయించాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో రెండు తెలుగు రాష్ట్రాలకు సరుకులు పంపిణీ చేసే టెండర్‌ను స్థానికులు దక్కించుకున్నారన్నారు. అయితే టెండర్ సమయంలో చూపించిన సరుకుల నాణ్యత సరఫరాలో ఉండడం లేదని ఆరోపించారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు ఖరారయిన టెండర్లపై దర్యాప్తు చేయాలన్నారు. పౌర సరఫరాల కార్పొరేషన్ సభ్యుడిగా తాను సూచించిన మేరకు ఎండీయూలు రద్దు చేసి, రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి డిపోలను ప్రారంభిం చడం సంతోషదాయకమని గద్దే పేర్కొన్నారు.

ఆక్రమిత స్థలంలో మొక్కల తొలగింపు

భోగాపురం, జూన్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడ పంచాయతీ సర్వే నెంబరు 64 లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో ఆదివారం రెవెన్యూ సిబ్బంది మొక్కలు తొలగించారు. 'కొండ కబ్జా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు ఎం.సురేష్ ఆధ్వర్యంలో వీఆర్వో కాశీశ్వరరావు సంబంధిత స్థలానికి వెళ్లి అక్కడ నాటిన కొబ్బరి మొక్కలు తొలగించారు. దీనిపై తహసీల్దారు సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆక్రమణ స్థలంలో నాటిన మొక్కలు తొలగించడం జరిగిందని రెండు రోజుల్లో రావాడ రెవెన్యూ సర్వే నెంబరు 64లో రికార్డుల ఆధారంగా పూరిస్థాయిలో సర్వే చేపడతామన్నారు. ప్రభుత్వ స్థలమని బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

సాధనతోనే క్రీడల్లో రాణింపు


దుస్తుల పంపిణీలో ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సాధనతో క్రీడాకారులు రాణించే అవకాశం ఉందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. నాణ్యమైన శిక్షణ, తగిన వసతులు కల్పించినప్పుడే క్రీడల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. క్రీడాకారులుగా ఎదగడానికి కోచ్ బాధ్యత వహించినట్లే తల్లిదండ్రులు ప్రోత్సాహించాలన్నారు. ఎస్.కోట బ్యాడ్మింటన్ క్రీడాకారులను తయారు చేస్తున్న కోచ్ పొట్నూరు శ్రీరాములును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు దుస్తులు, బహుమతులు ప్రదానం చేశారు. డాక్టర్ ఎస్.వి. సత్యశేఖర్, ఎ.ఎస్.వెంకటరావు, ఎం.సుబ్బారావు, మల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో మంత్రి పూజలు


పూజలుచేస్తున్న మంత్రి కొండపల్లి

గజపతినగరం, జూన్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంకాళి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మంత్రి అమ్మవారిని కొండపల్లి శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గజపతినగరం బజార్ సెంటర్‌లోని వెంటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంత్రి దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, ఈవో శ్రీరామ్, ఆలయ కమిటీ చైర్మన్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనా విముక్తి దినం: ఎంపీ కలిశెట్టి

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది జూన్ 4న మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించడంతో ఆ రోజుని జగన్ పాలనా విముక్తి దినంగా ప్రకటిస్తున్నామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన నగరంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పు పట్ల జగన్‌కు గౌరవం లేదని విమర్శించారు. ప్రజలు తీర్పు ఇచ్చే రోజును వెన్నుపోటు దినంగా ప్రకటించడంలోనే ఆయన వ్యక్తిత్వం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. కడపలో మహానాడు నిర్వహించకూడదని ఆ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇప్పించిన ఘనత జగన్‌దేనని చెప్పారు. వైసీపీ కార్యక్రమాలను టీడీపీ ఏనాడైనా అడ్డుకుందా అని ప్రశ్నించారు. కడపలో మహానాడు అద్భుతంగా జరిగిందని, రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారని చెప్పారు. కడప ప్రజలు కూడా మహానాడులో ఎంతో ఆనందంగా పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలో కూటమి పాలన ఎంతో చక్కగా సాగుతుందని, ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిసారిస్తున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని మోహన్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట జూన్ 1 (ఆంధ్రజ్యోతి):వేపాడ మండలం అరిగిపాలెం గ్రామానికి చెందిన ముక్కా బంగారమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి రూ.8 లక్షలు మంజూరయ్యాయి. ఆదివారం శృంగవరపుకోట పట్టణంలోని కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ.. బాధితురాలికి సంబంధిత చెక్‌ను అందజేశారు. అనంతరం జామి మండలం జాగారం గ్రామానికి చెందిన యువతకు విద్యాసంకల్పం కింద 1000 పుస్తకాలను ఆయన అందజేశారు. కార్యక్రమానికి ముందు గొంప కృష్ణ జన్మదిన వేడుకలను కార్యకర్తలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, వివేకానంద విద్యాసంస్థల అధిపతి సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్, టీడీపీ నాయకులు జుత్తాడ రామసత్యం, లగుడు రవికుమార్, గొంప వెంకటరావు, గుమ్మడి భారతి, ఇప్పాక వెంకట త్రివేణి, ఎం.మంగరాజు తదితరులున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

● కాపాడిన విజయనగరం వన్‌టౌన్ పోలీసులు

విజయనగరం క్రైమ్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సమీపంలోని రామనారాయణం పరిసరాల్లో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సాలూరు పట్టణానికి చెందిన యువకుడు మనస్తాపంతో ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి విజయనగరం చేరుకున్నాడు. ఆత్మహత్య చేసుకుంటానని తన కోసం వెతక వద్దని ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దాంతో అతడి కుటుంబ సభ్యులు విజయనగరం వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్‌కు ఫోన్‌లో తెలిపారు. పోలీసులు తక్షణమే స్పందించి ఫోన్ నెంబర్ ఆధారంగా రామనారాయణం సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఉన్నట్టు గుర్తించారు. వెంటనే సీఐశ్రీనివాస్ సిబ్బంది ట్రాక్ వద్దకు చేరుకుని యువకుడిని పట్టుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

బీజేపీ నాయకుడు సత్యనారాయణ కన్నుమూత

●వైద్య కళాశాలకు భౌతికకాయం అప్పగింత


సత్యనారాయణమూర్తి(ఫైల్)

గుర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):బీజేపీ నాయకుడు గొల్లపూడి సత్యనారాయణమూర్తి (57) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి గరికవలసలో కన్నుమూశారు. మానవతావాదిగా జీవనం సాగించిన ఆయన తన మరణానంతరం వైద్య విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్థానిక మిమ్స్‌కు తన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు అప్పగించారు. మండలంలో గరికివలస గ్రామానికి చెందిన గొల్లపూడి సత్యనారాయణ మూర్తి బీజేపీ మండల పార్టీ అధ్యక్షులుగా గతంలో సేవలు అందించారు. అలాగే జిల్లా స్థాయిలో బీజేపీలో కీలకంగా వ్యవహరించి అందరి మన్ననలు పొందారు. అయితే కొంతకాలంగా అనారోగ్య కారణంగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి తన స్వగ్రామం గరికివలసలో తుదిశ్వాస విడిచారు. ఆదివారం గొల్లపూడి భౌతికకాయానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశఖవర్మ, మాజీఎమ్మెల్సీ మాధవ్, మాజీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని.. బీజేపీ జెండాను కప్పి నివాళులర్పించారు. గొల్లపూడి భార్య డాక్టర్ పాకరాణి నాగమల్లిక, కుమారులు పృథ్వీరాజ్, అమృతరాజ్ ఉన్నారు.

మహేశ్వరమ్మకు ఘన సత్కారం


మహేశ్వరమ్మ, నర్సింహులును సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం రింగురోడ్డు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పదవీ విరమణ పొందిన కనకదుర్గ మహేశ్వరమ్మ, నరసింహులు దంపతులను ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని ముక్కుపాలవలసలో పాఠశాలలో మహేశ్వరమ్మ ఉపాధ్యాయురాలి విధులు నిర్వర్తించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పశు సంవర్థకశాఖ జేడీ డాక్టర్ వై.వి.రమణ, రణస్థలం ఎంఈవో ఎ.త్రినాథరావు హాజరై మహేశ్వరమ్మ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కె.వి.రమణ, హెచ్ఎం పి.బి.వర్మ, డాక్టర్ సన్యాసమ్మ, గండ్రేటి అప్పలనాయుడు, బాబురావు పాల్గొన్నారు.

రేషన్ డిపోలతో మేలు: కళా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల ద్వారానే లబ్ధిదారులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కస్పా వీధిలోని రేషన్ డిపోలో సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతోనే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం అతి తక్కువ ధరకు బియ్యం పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే నాలుగింటిని అమలు చేశామన్నారు. మిగిలినవి కూడా త్వరలో అమలవుతాయన్నారు. పథకాల అమలు చూడలేని ప్రతిపక్ష నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎన్.రాజారావు, పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, మహంతి అప్పలనాయుడు, బైరెడ్డి లక్ష్మణరావు, బాణాన రామకృష్ణం నాయుడు, మీసాల నవీన్, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, కె.కృష్ణ, బీజేపీ ప్రతినిధి ఇప్పిలి నీలకంఠం, డీలర్ల సంఘం ప్రతినిధులు రుంకాన రామారావు, గోపాల్, కామేశ్వరరావు, సూరు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు తొలగిన ఇబ్బందులు


బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శృంగవరపుకోట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పేదల ఇబ్బందులను తొలగించేందుకు రేషన్ దుకాణాల ద్వారా సరుకుల అందజేతకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఒన్‌వే ట్రాఫిక్ లైన్‌లోని చౌక ధరల దుకాణం వద్ద రేషన్ బియ్యాన్ని ఆమె పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం గతంలో ఇంటింటికీ రేషన్ అంటూ వాహనాలను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు.అయితే ఆ వాహనం ఎప్పుడు వీధిలోకి వస్తుందో తెలియక దాని కోసం ఎదురు చూడాల్సి వచ్చేదన్నారు. ఇంటింటికీ రేషన్ ఇవ్వకుండా వీధి చివరన వాహనాన్ని నిలిపి వినియోగదారులను క్యూ కట్టించే వారన్నారు. ఆ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికిందన్నారు. ఇకపై రేషన్ దుకాణాల నుంచి నెలలో 15 రోజుల పాటు సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు. వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు డీలర్లే సరుకులు పంపిస్తారన్నారు. ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, నాయకులు కొణదం మల్లేశ్వరరావు, నానానిగిరి రమణాజీ, భీశెట్టి అరుణ, చక్క కిరణ్, కాపుగంటి వాసు, పెదగాడి రాజు తదితరులున్నారు.

●లక్కవరపుకోట: మండల కేంద్రమైన ఎల్.కోటలో ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి రేషన్ డిపోను ప్రారంభించారు. ఇకపై నెలలో 15 రోజులు నిరంతరాయంగా రేషన్ సరుకులు డిపోల ద్వారా ప్రజలకు అందుతాయన్నారు. 65 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే సరుకులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, ఎల్.కోట పట్టణ పార్టీ అధ్యక్షుడు పుట్టా శ్రీను, యూత్ అధ్యక్షుడు ఎస్.రాజేశ్ పాల్గొన్నారు.

కార్డుదారులకు మెరుగైన సేవలు


డిపోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూన్1(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు మెరుగైన సేలందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఆదివారం మండలంలోని ముంజేరులో చౌక ధరల దుకాణంలో రేషన్ సరుకులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం.సురేష్, సీఎస్‌డీటీ బి.వి.మురళీ, నాయకులు పల్లంట్ల జగదీశ్, పల్ల రాంబాబు, వరుపుల సుధాకర్, సర్పంచ్ పూడినూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా రేషన్


రేషన్ అందజేస్తున్న బంగార్రాజు

భోగాపురం, జూన్1 (ఆంధ్రజ్యోతి):తెల్లకార్డు లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చౌకధరల దుకాణాల్లో రేషన్ అందజేయడం జరుగుతుందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లి, లింగాలవలస, రాజాపులోవ గ్రామాల్లో ఆదివారం చౌకధరల దుకాణాల్లో రేషన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. గతంలో రేషన్ వాహనం కోసం పనులు కూడా మానుకునే వారన్నారు. ఇప్పుడు లబ్ధిదారులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. నెలలో 15 రోజులు పాటు చౌకధరల దుకాణం తెరచుకుని ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, కర్రోతు రాజు, లింగాలవలస సర్పంచ్ బుగతలలిత, ఎంపీటీసీ సభ్యురాలు కిలారి కొండమ్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్

నెల్లిమర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్ తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి అన్నారు. ఆదివారం సెంచూరియన్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఉన్నతికి అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఎదిగే వయసులో పిల్లలు తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ పుష్పలత, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, ప్రొఫెసర్ పి.ఎస్.వి.రమణారావు, డాక్టర్ మాధవరావు, ఐక్యూఏసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నిదయాల్ తదితరులు మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సాయి (ఫైల్)

భోగాపురం, జూన్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాపులోవ జాతీయ రహదారిపై ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విశాఖ జిల్లా భీమిలి మండలంలోని టి.నగరపాలెంకు చెందిన యువకుడు గడ దాసరి సాయి (27) ఆదివారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. నగరపాలెంకు చెందిన సాయి శనివారం ద్విచక్ర వాహనంపై నగర పాలెం నుంచి విజయనగరం వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని మరలా అదేరోజు రాత్రి బయలుదేరాడు. రాజాపులోవ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు విశాఖలోని కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..

సీతానగరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుచ్చిమి సమీపంలో ఆదివారం గుర్తు తెలియని రైలు ఢీకొన్నఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. గుచ్చిమి గ్రామానికి చెందిన ఎం.అప్పలనాయుడు (33) ఇంటి నుంచి మామిడి తోటకు వెళ్తున్న సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొంది. దీంతో అప్పలనాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్ కేసు నమోదు చేశారు.

బావిలో స్నానానికి దిగిన యువకుడి..

పార్వతీపురం రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సిపురం నుంచి వీఆర్‌పేట వెళ్లే మార్గంలో ఉన్న ఓ నేలబావిలో ఆదివారం స్నానానికి దిగిన యువకుడు మృతి చెందాడు. పార్వతీపురం పట్టణానికి చెందిన మజ్జి తరుణ్ (23) తన స్నేహితులతో నేలబావిలోకి స్నానానికి దిగి మృతి చెం దాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మోటార్ సైకిళ్లకు నిప్పు

●మూడు వాహనాలు దగ్ధం ●అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఘటన


దగ్ధమైన మోటార్ సైకిళ్లు

కొత్తవలస, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస పంచాయతీ వసంత్ విహార్ అపార్ట్‌మెంట్‌లో గుర్తుతెలియని వ్యక్తి శనివారం రాత్రి మోటార్ సైకిళ్లకు నిప్పుపెట్టారు. ఇందుకు సంబంధించి అపార్ట్‌మెంట్ బ్లాక్ అధ్యక్షుడు సారిక శంకరరావు వివరాల మేరకు.. శనివారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఒక మోటార్ సైకిల్‌కు నిప్పంటించడంతో పక్కనే ఉన్న మరో మూడు మోటార్ సైకిళ్లకు మంటలు వ్యాపించాయన్నారు. దాంతో దగ్ధమయ్యాయన్నారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన స్వామి గౌడ్.. ఇక్కడి అపార్ట్‌మెంట్‌లో ఇంటిని కొనుగోలు చేసుకుని భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నారన్నారు. అయితే కొద్ది రోజులు కిందట స్వామి గౌడ్‌కు చెందిన మోటార్‌సైకిల్ టైర్లకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తి మేకులు గుచ్చారన్నారు. ఆయన మోటార్ సైకిల్‌ను బాగుచేయించి ఇంటి కింద సెల్లార్‌లో పెట్టి, కుటుంబంతో ఆయన సొంత ఊరు వెళ్లారన్నారు. శనివారం రాత్రి మళ్లీ అదే మోటార్ సైకిల్‌కు గుర్తు తెలియని వ్యక్తి నిప్పంటించడంతో పక్కనే మరో మూడు స్కూటీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మరో మోటార్ సైకిల్, కారు పాక్షికంగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న కొత్తవలస అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తెలిసిన వ్యక్తే ఈ పని చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులకు తలనొప్పిగా చోరీ కేసు

కొత్తవలస, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండంలోని మంగళపాలెం గ్రామం లోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీశ్‌బాబు ఇంటిలో జరిగిన చోరీకి సంబంధించిన నిందితుల ఆచూకీ కనుగొనడం పోలీసులకు తలనొప్పిగా మారింది. స్థానికంగా ఉన్న కొంతమంది అనుమానితులను పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దాంతో తామే దొంగతనం చేశామని వారు అంగీకరించారని, సొత్తు రికవరీ చేయాల్సి ఉందని ఎస్పీకి పోలీసులు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. నిందితులను సొమ్ము రికవరీ కోసం వారు చెప్పిన ప్రదేశానికి తీసుకువెళ్లారు. అయితే అక్కడఎలాంటి సొత్తును పోలీసులు గుర్తించలేదు. పోలీసుల ట్రీట్‌మెంట్‌కు భయపడి అంగీకరించినట్టు చెప్పడంతో దర్యాప్తు అధికారులు కంగుతిన్నారు. దీంతో ఇంతవరకు చోరీకి పాల్పడిన వారు స్థానికులేనన్న అనుమానాలు తొలగిపోవడంతో మరో కోణంలో దర్యాప్తు సాగిస్తున్నట్టు తెలిసింది. నేరం చేసిన వారు మహారాష్ట్రకు చెందిన గ్యాంగ్ అయి ఉండవచ్చుననే అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆ దిశగా పోలీసుల దర్యాప్తుప్రారంభించినట్టు తెలుస్తోంది. ఘటనా స్థలానికి రైల్వేస్టేషన్ సుమారు రెండు కిలోమీటర్లు దూరంలోనే ఉండటంతో తమసొంత ప్రాంతానికి వారు వెళ్లి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులకే తలనొప్పిగా మారిన ఈ దొంగతనం జిల్లా పోలీసులు ఒక సవాల్ తీసుకుని నేరస్థులను పట్టుకోవడానికి అన్ని కోణాలలోను దర్యాప్తు సాగిస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

రాజాం రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గతనెల 24 నుంచి కుమార్తె కనిపించడం లేదని అప్పలనాయుడు రాజాం పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న తన కుమార్తె సెలవుల్లో రాజాంలోని బొబ్బిలి రోడ్డులోని ఓ గాజుల షాపులో పనిచేసేందుకు చేరింది. గత నెల 22న తాతగారి గ్రామం ఆబోతులపేట వెళ్తానని చెప్పి వెళ్లిందన్నారు. ఆబోతులపేట నుంచి గతనెల 24న తన మేనమామ కోటి ద్విచక్ర వాహనంపై రాజాం చేరుకున్న తన కుమార్తె ఇంటికి రాలేదని ఫిర్యాదులో అప్పలనాయుడు పేర్కొన్నారు. తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు.

ఆర్అండ్‌బీ కార్యాలయంలో అగ్నిప్రమాదం

పార్వతీపురం,జూన్ 1(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలోని బెలగాంలో గల ఐటీడీఏ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న ఆర్అండ్‌బీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలకఫైళ్లతో పాటు పలు దస్త్రాలు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు బహిర్గతం కాలేదు.

ఏదో ఒకటి తేల్చాల్సిందే!

(ఐదో పేజీ తరువాయి)



ఎస్.కోట మండలంలో జిందాల్‌కు అప్పగించిన భూముల చుట్టు ప్రహరీ నిర్మించిన దృశ్యం

ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గత వైసీపీ ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. బాక్సైట్ తవ్వకాలకు గిరిజనులు ఒప్పుకోలేదు. గిరిజన ప్రాంతాల్లో ఆదరణ కోల్పోతామని భయపడిన వైసీపీ తర్వాత బాక్సైట్ జోలికి పోలేదు. అయితే ఎస్.కోటలో జిందాల్ పరిశ్రమకు భూములిచ్చిన రైతులను సంతృప్తి పరిచేందుకు సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందునుంచి ఎంఎస్ఎంఈ పార్కు (మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్)ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిస్తూ వచ్చింది. కానీ చేయలేదు. ఇప్పుడు తిరిగి జనసేన, బీజేపీలతో కలసి టీడీపీ అధికారంలో ఉంది. బాక్సైట్ తవ్వకాలకు అడ్డుపడిన ఈ పార్టీ తిరిగి పునఃసమీక్షించుకొనే అవకాశం లేదు. ఇక ఈ భూముల్లో పరిశ్రమ వచ్చే అవకాశం లేదు.భూసేకరణ ద్వారా జిందాల్ యాజమాన్యం 208.54 ఎకరాల ప్రభుత్వ భూములు, 919.22 ఎకరాలు డి.పట్టాభూములను 2008లో ప్రభుత్వం నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఆ సమయంలో షేర్లు, ఉద్యోగాలు, ఇళ్లు లేని వారికి నివాసాలు, విద్యుత్ సదుపాయంతో రోడ్లు, సామాజిక భవనం, ఉపాధి అవకాశాల మెరుగుకు శిక్షణ కేంద్రం, ఆరోగ్య కేంద్రం, చైల్డ్ కేర్ సెంటర్, చిన్న పిల్లల సంరక్షణతో పాటు ప్రాథమిక పాఠశాల, ఆటస్థలాలు,పశువుల సంరక్షణకు స్థలం వంటి సదుపాయాలను కల్పిస్తామని నమ్మబలికారు. ఇవేవీ జరగలేదు. కాగా అప్పట్లో రెండు వందల కోట్ల రూపాయల ధర ఉన్న ఈ భూమి ఇప్పుడు రెండు, మూడు వేల కోట్లకు చేరింది. భూములిచ్చిన రైతులకు మాత్రం కూలి పని చేసుకొనేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఎకరా భూమికి రూ.2లక్షల వరకు ఇచ్చారు. ఇవి అప్పుడే ఖర్చుపెట్టేశారు. ఖాళీగా వున్న భూమిని తిరిగి ఇచ్చేస్తే వ్యవసాయం చేసుకుంటామని గిరిజన రైతులు ప్రాధేయపడుతున్నారు. కనీసం ప్రభుత్వ భూమిగానైనా ప్రకటించి ఈ భూముల్లో వ్యవసాయం చేసుకొనేందుకు అవకాశం కల్పించాలని అడుగుతున్నారు. స్థానిక పెద్దల సహకారంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమానికి సిద్ధపడుతున్నారు.

ఉత్సవ సందడి

(ఐదో పేజీ తరువాయి)

చింతాడ కుటుంబ సభ్యులు ఇప్పలపోలమ్మకు 54 రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో మేళతాళాల మధ్య ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

తరలివస్తున్న భక్తులు

ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ, బంగారమ్మ తల్లులను దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణ, ఒడిశాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి స్థానికులు వస్తుండడంతో పట్టణం కిటకిటలాడుతోంది. సుమారు 3 లక్షల మంది వరకు అమ్మవార్లను దర్శించుకోనే అవకాశం ఉందని, ఉత్సవ కమిటీల సభ్యులు చెబుతున్నారు. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు పట్టణ సీఐ మురళీధర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఉయ్యాల కంబాల

ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ తల్లుల ఉయ్యాల..కంబాల ఉత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇప్పల పోలమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రెడ్డి వీధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని మహిళలు, యువత భారీ సంంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తమ కుటుంబాలు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దంపతుల ఇప్పలపోలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వారిని ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు.

నేడు తొలేళ్లు

పట్టణంలో సోమవారం జరిగే తొలేళ్లకు ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ ఉత్సవ కమిటీల సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక నైవేద్యంతో పాటు పూజలు, పూలంగి సేవలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఆలయాల వద్ద భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. మంగళవారం సిరిమానులు తిరిగే వీధుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్, ఉత్సవ కమిటీ సభ్యులు పనులు చేపడుతున్నారు. సుమారు రూ.40 లక్షలతో మున్సిపాల్టీలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. మున్సిపాల్టీలో 103 మంది కార్మికులు ఉండగా అదనంగా 30 మందిని నియమిస్తున్నట్లు వెల్లడించారు. అవసరమైతే ఇతర మున్సిపాల్టీల నుంచి కార్మికులను తీసుకొస్తామని ప్రజారోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు.

అందరి సాయంతో పండుగ విజయవంతం

సాలూరు, జూన్ 1(ఆం ధ్రజ్యోతి): సాలూరు గ్రామ దేవత శ్యామలాంబ అమ్మ వారి పండుగను గతనెల 18,19,20 తేదీల్లో అందరి సహకారంతో విజయవం తంగా నిర్వహించినట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం సాలూరులో శ్యామలాంబ అమ్మవారి పండుగ విజయోత్సవసభను నిర్వహించారు. తొలుత అమ్మవారి పండుగ విజయవంతం చేసేందుకు శ్రమించిన పారిశుధ్య కార్మికులు, విద్యుత్, వైద్య, ఆరోగ్య శాఖ, పోలీసుశాఖతోపాటు పలు శాఖలకు చెందిన ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి పండుగ ప్రకటించినప్పటి నుంచి అన్నిశాఖలను సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల నిధులు సమకూర్చుకుని ముందుకువెళ్లినట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

సీతానగరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. ఆదివారం మండలంలోని గుమ్మడివరంలో రామాలయం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ గుమ్మడివరం గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సత్యంనాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయపాలన పాటించాలి

పార్వతీపురంటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు సమయపాలన పాటించి తమ లక్ష్యాలను చేరుకోగలరని మన్యం జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు తెలిపారు. ఆదివారం పట్టణ శివారుల్లో గల ఆశాజ్యోతి చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థి జీవితానికి దిక్సూచి కావాలే కాని, నాశనం చేయకూడదన్నారు. కాలానికి కట్టుబడిఉండేలా విద్యార్థి తన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశాజ్యోతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జల్లు వినయ్, వ్యవస్థాపక సభ్యులు బి.నాగభూషణరావు, జగదీష్, పి.సాయికిరణ్ పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

సాలూరు రూరల్, జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో జీవో-3ను పునరుద్ధరించి గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్రకార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం సాలూరు మండలంలో జగ్గుదొరవలస, మావుడి, తోణాం, మామిడిపల్లిలో ఆదివాసీ గిరిజన సంఘం నిర్వహిస్తున్న జీపుజాతా నిర్వహించారు.

ఆధునిక పద్ధతులు అవలంబించాలి

సీతానగరం,జూన్ 1(ఆంధ్రజ్యోతి):ప్రస్తుత కాలానికి అనుగుణంగా రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించాలని ఐసీఏఆర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, ఎక్స్‌టెన్షన్ శాస్త్రవేత్త అనంత్ విహారి తెలిపారు. మండలంలోని వెంకటపురంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయం చేసే ప్రతి ఒక్క రైతు ఆధునిక పద్ధతులు అవలంబిస్తే మంచి లాభాలు పొందుతారన్నారు.అనంత్ విహారి మాట్లాడుతూ బ్లాక్ బెంగాల్ మేకలు పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటేష్ మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి ముందస్తు విత్తన ప్రణాళికను గురించి వివరించారు.

ప్రతి కుటుంబానికీ సరుకులు

● రేషన్‌షాపుల ద్వారా పంపిణీ ప్రారంభం



వీరఘట్టం: లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

ప్రతి కుటుంబం తాము నచ్చిన సమయానికి, తమకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ దుకాణం నుంచైనా సరుకులు తీసుకోవచ్చని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ఆదివారం జిల్లాలోని రేషన్‌షాపుల ద్వారా సరుకుల పంపిణీని ప్రారంభించారు.

●పార్వతీపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వంలో జరిగిన రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు తమ ప్రభుత్వం పీడీఎస్ ద్వారా సరుకుల పంపిణీలో మార్పులు చేసిందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు.మండలంలోని వెంకంపేట, పార్వతీపురంలోని బంగారమ్మకాలనీ, సీతానగరం మండలంలోని మరిపివలసలో రేషన్ డిపోలను ప్రారంభించి కార్డు హోల్డర్లకు సరుకులను పంపిణీ చేశారు.

●పార్వతీపురంటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సరుకుల పంపిణీలో తప్పు జరిగితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. పట్టణంలోని 17వ వార్డులో ఏర్పాటుచేసిన రేషన్‌డిపోలను పునః ప్రారంభించారు.

●సీతంపేట రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఇకపై ఒకటి నుంచి 15వతేదీ వరకు రెండు పూటల డీఆర్‌డిపోల ద్వారా నిత్యవ సర సరుకులు అందుతాయని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు.గొయిదిలో జీసీసీ డీఆర్‌డిపోను ఎమ్మెల్యే ప్రారంబించి నిత్యవసర సరుకులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలు గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం డి.కృష్ణారావు, నాయకులు హెచ్.ప్రసాద్,పవన్,ఎం.విశ్వనాదం,బి.చంద్రరావు, చంద్రశేఖర్, శేషు పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

●వీరఘట్టం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని కూరాకులవధిలో ఆదివారం రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పునః పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు ఉదయానఉదయ్‌భాస్కర్, పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, జామి లక్ష్మీనారాయణ, చింతా ఉమా, బల్లా హరిబాబు పాల్గొన్నారు.

కలగా కాజ్‌వే నిర్మాణం

● కొత్తవలస ఆనకట్ట వద్ద పొంచిఉన్న ప్రమాదం

మక్కువ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మక్కువ-సీతానగరం మండలాల సరిహద్దు ప్రాంతంలోని సువర్ణముఖి నదిపై కొత్తవలస ఆనకట్టపై కాజ్‌వే నిర్మాణం కలగా మారింది. ఇక్కడ కట్టడాలు శిథిలావస్థకు చేరడంతో ప్రమాదం పొంచిఉంది. ప్రమాదమని తెలిసినా వాహనచోదకులు, ప్రయాణికులు అవతల వైపు గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఆనకట్ట కాజ్‌వేపై నుంచి కొంతమంది బండరాళ్ల మధ్య పడి ప్రమా దాలు చోటుచేసుకున్న విషయం విదితమే. ప్రధానంగా పార్వతీపురానికి చేరుకునేందుకు సులువైన మార్గం కావడంతోపాటు కాజ్‌వే అవతల వైపు ఉన్న గ్రామాలు దగ్గరగా ఉండడంతో ఈ మార్గంగా గుండా ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో పోలీసులు కాజ్‌వేపై నుంచి అటు, ఇటు వాహనాలు వెళ్లకుండా భారీ గుంతలు తీశారు. అయినా కొందరు వాటిని దాటుతూ రాకపోకలు సాగించేవారు. గతంలో ఆనకట్ట వద్ద కాజ్‌వే నిర్మాణానికి టెండర్లు పిలిచిన నిధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకురాకపోవడం వల్ల కాజ్‌వే నిర్మాణం కలగానే మిగిలింది. నిత్యం



ఆనకట్టపై రక్షణ గోడలు లేని దృశ్యం (ఫైల్)

అధిక సంఖ్యలో వాహనాలు శిథిలావస్థకు చేరిన కాజ్‌వేపై నుంచి వెళ్తుండడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి ఆనకట్టు కాజ్‌వేపై నుంచి రాకపోకలు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జీవో-3ను పునరుద్ధరించాలి

●గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్

కురుపాం,జూన్1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జీవో- 3ను పునరుద్ధరించి గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలు శతశాతం గిరిజనులకే కేటాయించాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. శనివారం సీతంపేటలో ప్రారంభమైన ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన జీపు జాతర ఆదివారం కురుపాం చేరుకుంది. ఈ సందర్భంగా కురుపాం రావాడ రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సురేంద్ర మాట్లాడుతూ మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ టీచర్ల పోస్టులను మినహాయించి శతశాతం ఉద్యోగాలు ఆదివాసులకే కేటాయించాలన్నారు. మెగా డీఎస్సీలో ఏజెన్సీ ప్రాంతంలో సుమార్ 766 టీచర్ల పోస్టులు గిరిజనులకు దక్కవలసి ఉండగా కేవలం 42 మాత్రమే గిరిజనులకు రిజర్వేషన్ చూపిస్తున్నరని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మేగా డీఎస్సీ మినహాయించి, గిరిజనులకు స్పెషల్ డీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ వేసి శతశాతం గిరిజనులకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.



కురుపాం: మాట్లాడుతున్న సురేంద్ర

హామీలు అమలు చేయాలి

మక్కువ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరారు. మండలంలోని మార్కొండపుట్టి, వైఎస్‌వలసలో జీపుజాతా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన ప్రాంతంలో జీవో నెంబర్-3ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం జిల్లా నాయకులు ఎం.రామస్వామి, వ్యవసాయసంఘం జిల్లాకార్యదర్శి కొల్లి గంగునాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు, తాడంగి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ రక్కసిపై యుద్ధం

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డలు ఫ్లోరోసిస్ బారిన పడకుండా కాపాడవచ్చని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

ప్రాథమిక స్థాయిలోనే గుర్తించామన్న డీఎంహెచ్‌వో..

జిల్లాలో ప్రాథమిక స్థాయిలో ఫ్లోరైడ్ బాధితుల్ని గుర్తించేందుకు వీలుగా చర్యలు ప్రారంభించామని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎస్.జీవనరాణి ఇప్పటికే ప్రకటించారు. ఇందుకోసం ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు శిక్షణనిచ్చి ఫ్లోరోసిస్ బాధితులకు చికిత్స అందిస్తామని ఆమె స్పష్టం చేశారు. రాజాం నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలలోని 25 గ్రామాలలో ఫ్లోరోసిస్ మూలాలున్నట్లు గుర్తించామన్నారు. 88 మందిలో ముగ్గురు పిల్లలు, ఆరుగురు పెద్దలు డెంటల్ ఫ్లోరోసిస్ వ్యాధిబారిన పడ్డారని, మరో ఇద్దరికి స్కెలిటల్ ఫ్లోరోసిస్ సోకిందని స్పష్టం చేశారు. బాధితులకు మందులు అందజేస్తున్నామని, నడవలేని వారికి వీల్‌ఛైర్లు సైతం ఇచ్చామని తెలిపారు. ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలలో ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నామని, ఎలాంటి పదార్థాలు తీసుకోవాలో, ఏవి తినకూడదో అవగాహన కల్పిస్తున్నట్లు జీవనరాణి వెల్లడించారు.

ఎందుకిలా..

వాస్తవానికి తాగేనీరు, తీసుకున్న ఆహారం ద్వారా ఎక్కువమొత్తంలో ఫ్లోరైడ్ వ్యక్తి శరీరంలోకి వెళ్తే ఏర్పడే అనారోగ్యాన్ని ఫ్లోరోసిస్ అంటారని వైద్యశాస్త్రం స్పష్టం చేస్తోంది. ఇవే కాకుండా నీటిలో ఉండే 15 మూలకాలతో పాటు నైట్రేట్, బెరిలియం వంటి ప్రమాదకర కారకాలు మనిషి శరీరంలోకి ప్రవేశించి ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ సి తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం కూడా ఫ్లోరోసిస్‌కు మరో కారణం. మూత్ర సంబంధిత వ్యాధులతో బాధపడినవారి ఎముకల్లో ఫ్లోరైడ్ ఉండిపోవడం కూడా ఇంకో కారణం.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

గుట్కా, ఖైనీ వంటి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. అల్యూమినియం పాత్రల్లో వండే పదార్థాలను తినకూడదు. రక్షిత నీటిని తాగాలి. అల్లం, వెల్లుల్లి, చిరుధాన్యాలు, క్యారెట్, బొప్పాయి, టమాటా, పప్పుధాన్యాలు, చిలగడ దుంపలు, తీసుకోవాలి. పాలు, పెరుగు, జున్ను, బెల్లం, ఆకుకూరలు, మునగకాడలు, జీలకర్ర, ఉసిరి, జామ, నిమ్మ తీసుకుంటే మేలని వైద్యులు తెలిపారు.

రాజాం నియోజకవర్గంలో...

రాజాం నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలలోని 25 గ్రామాలలో ఫ్లోరైడ్ ప్రభావం ఉన్నట్లు జిల్లా వైద్యశాఖ గుర్తించింది. వాస్తవానికి ఉష్ణోగ్రతల ఆధారంగా పరిశీలిస్తే.. ఫ్లోరైడ్ స్థాయి 0.7 నుంచి 1.2 పిపిఎంగా ఉన్న జలాలను తాగవచ్చు. అయితే వైద్యశాఖ నిర్ధారించిన 25 గ్రామాల్లో తాగునీటిలో 1.5 పిపిఎం కన్నా ఎక్కువగా ఉన్నట్లు వైద్యశాఖ గుర్తించింది. దీంతో ఆయా గ్రామాల్లో కొంతమంది ఫ్లోరోసిస్ బారిన పడినట్లు అధికారులు ప్రకటించారు.

- రాజాం మండలంలో... అంతకాపల్లి, పొగిరి, అమరాం, దోసరి, మారేడుబాక..
- రేగిడి మండలంలో... కొర్లవలస, అంబకండి, మునకలవలస, లింగాలవలస, పెద శిర్లాం, పారంపేట, వన్నలి, ఒప్పంగి, వెంకంపేట
- సంతకవిటి మండలంలో... మండాకురిటి, గోవిందపురం, బిల్లాణి, గుళ్ల సీతారాంపురం, మాధవరాయపురం, గోళ్లవలస
- వంగర మండలంలో... కొట్టిశ, కోనంగిపాడు, శ్రీహరిపురం, లక్ష్మీపేట కాలనీ, మరువాడ గ్రామాల్లో ఫ్లోరైడ్ బాధితులను వైద్యశాఖ గుర్తించింది.

నిర్వహణ లేక.. పూడికలు తొలగించక

● ఇదీ సీతారామసాగర్ పరిధిలో కాలువల పరిస్థితి



కాలువలో పేరుకుపోయిన పూడికలు

బొబ్బిలి రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని అలజంగి శివారున గల సీతారామసాగర్ చెరువు నుంచి అలజంగి, పిరిడి పరిధిలోని వందలాది ఎకరాలకు నీరు అందించే కాలువలు పూర్తిగా పూడికలతో నిండిపోయాయి. ప్రధానంగా అధికారులు పూడిక తొలగింపు, నిర్వహణపై దృష్టిసారించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.త్వరలో ఖరీఫ్‌సీజన్ ప్రారంభంకానుండడంతో కాలువలో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. తక్షణమే వర్షాకాలం ప్రారంభం కాకముందే పూడికలు తొలగించకపోతే సాగు నీరు ప్రవహించడం కష్టమని పలువురు చెబుతున్నారు.పూడికలు తొలగించాలని పలుపార్లు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు. కాగా ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేయించి కాలువలో నీరు పారేలా చర్యలు తీసుకుంటామని ఏపీవో లక్ష్మీపతిరాజు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని మాజీ సైనికులు కోరారు. ఆదివారం బొబ్బిలిలో మాజీ సైనికసంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షుడు రేవళ్ల కిరణ్ కుమార్ సమక్షంలో సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఇళ్ల స్థలాల కోసం కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కార్యవాహకకార్యదర్శి ఎస్ఆర్‌మోహనరావు, ట్రెజరర్ వీఎస్‌శర్మ పాల్గొన్నారు.

స్పెషల్ ఒలింపిక్స్‌లో సత్తాచాటిన విద్యార్థి

బాడంగి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి రాజానఅజయ్ ఇటీవల ఏలూరు సమీపంలోని హీల్‌పాఠశాలలో జరిగినరాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ పోటీల్లో వంద మీటర్ల పరుగులో సత్తాచాటాడు.ఈ మేరకు స్వర్ణ విజేతగా నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అజయ్‌ను అభినందించారు.

జేసీరాజుకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం

బొబ్బిలి/రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక సేవకుడు, కారుణ్యఫౌండేషన్, రోటరీ సంస్థల ఛైర్మన్ జేసీ రాజుకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం లభించింది. ఈమేరకు ఎన్టీఆర్‌జయంతిని పురస్కరించుకొని విజయవాడలో సాహిత్య సాంస్కృతిక సంస్థ ఎక్సరే ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్మారక పురస్కారం ప్రదానంచేశారు.ఈ మేరకు సినీ నటుడు రాజేంద్రప్రసాద్, సినిమాటోగ్రఫీ శాఖ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అవార్డు అందుకున్నారు.

గంజాయి రవాణా కట్టడికి చర్యలు

రామభద్రపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి రవాణా కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ఎనుబరువు వద్ద 6లైన్‌రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ఒడిశా నుంచి ఎక్కువగా గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో ఈ రోడ్డులో మరో కొత్త చెక్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పాచిపెంట మండలంలోని మాతుమూరు వద్దగాని, హెచ్‌జీ ఇన్‌ఫ్రా సైక్టర్ ఆఫీసు వద్దగాని చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రామభద్రపురం మండలంలోని కొట్టక్కి వద్ద ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని, దీంతో ఇటీవల గంజాయి అక్రమ రవాణాను నిరోధించామని చెప్పారు. కార్యక్రమంలో బొబ్బిలి రూరల్ సీఐ కే.నారాయణరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.



6లైన్‌రోడ్డు పరిశీలిస్తున్న భవ్యారెడ్డి

ఒడిశా

గాంధీ విగ్రహావిష్కరణ

రాయగడ, జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): రాయగడ పురపాలక సంస్థ ఆధ్వర్యంలోని గాంధీ పార్కులో ఆదివారం గాంధీ విగ్రహాన్ని కోరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి శంకర ఉలక ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయగడ పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక, పురాధ్యక్షుడు మహేష్‌పట్నాయక్ పాల్గొన్నారు.

సమాజానికి కవి దిక్సూచి

రాయగడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కవి సమాజానికి దిక్సూచి వంటి వాడని, సమాజానికి ఉపయోగపడే రచనలు చేసి ప్రజలను జాగృత పరుస్తాడని రాయగడ రచయతల సంఘం(రారసం) అధ్యక్షుడు టీవీఎస్ఆర్ అప్పారావు తెలిపారు. ఆదివారం స్థానికరాజ్‌భవన్ హాలులో రార సం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రవచన కారుడు భళ్లమూడి వెంకట నాగేశ్వరరావు, కవులు భళ్లమూడి నాగరాజురామారావు, కార్యదర్శి టీకేపట్నాయక్, గణపతిరావు పాల్గొన్నారు.

5 నుంచి కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

సాలూరు రూరల్, జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): సాలూరులోని భూనీలా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల ఐదు నుంచి ఎనిమిదోతేదీ వరకు నిర్వహించనున్నట్టు వ్యవస్థాపక ధర్మకర్త వంగపండు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఏడో తేదీన తిరువీధిలో వాహన సేవ, రాత్రికి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

కురుపాం, జూన్1(ఆంధ్రజ్యోతి): కురుపాంకు చెందిన టీడీపీ కార్యకర్త సింగిడి శ్రీనివాసరావు ఇటీవల ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడడంతో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆయన్ను పరామర్శించారు.కార్యక్రమంలో కొండయ్య, కోలా రంజిత్‌కుమార్, ఆకుల రమేష్, కర్రి శ్రీనువాసరావు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించడంతో కేసు నమోదు

వీరఘట్టం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడుకూరులో ఎక్కిన ప్రయాణికుడు పిట్టపైడి రాజు విధులకు ఆటంకం కలిగించాడని కండక్టర్ టి.అరుణకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాలకొండ నుంచి పార్వతీపురం వస్తున్న ఆర్టీసీ బస్సులో ఎక్కిన పైడి రాజు ఫుట్ బోర్డుపై ఉండడంతో లోపలికి రావాలని కండక్టర్ సూచించారు. ఆ సమయంలో పైడి రాజు కండక్టర్‌పై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడని వీరఘట్టంలో పోలీసులకు ఫిర్యాదుచేసింది.ఈ మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ కలాధర్ చెప్పారు.